# అత్తగారూ-వాస్తుశాస్త్రం



ముందు మేమున్న పాతయిల్లు అద్దెకు యిచ్చి కొత్తింటికి వచ్చాము. ఆ యింటికి ఒకవైపు ఖాళీ స్థలం, మరొకవైపు పెద్ద బంగళా వున్నయ్—ఆ బంగళా ఎవరిదో తెలీదు గానీ ఆ యింట్లో వున్న మనుషులు దయ్యాల్లా రాత్రులు కనపడేవారు. పగలల్లా తలుపులు వేసి వుండేవి. ఆ యింటికి "దయ్యాలకొంప" అని పేరుపెట్టాం.

ఆ యింటి గృహప్రవేశం చేసిన కొత్తల్లో పక్కనున్న ఖాళీస్థలం చూసి మహా సంతోషపడ్డాం, ఆ ఖాళీస్థలంలో ఇల్లేదీ లేనందువల్ల గాలంతా సరాసరి మా యింట్లోకే వస్తుందని. కాని ఆ గాలి సుఖం అటుంచి, గోతు లెక్కువగా వున్నందువల్ల నీళ్ళు నిలిచి కప్పలు ఆ నీళ్ళల్లో యీతకొడుతూ ఆనందంగా అరుస్తూండేవి. ఆ అరుపులకు మాకు నిద్రపట్టేదికాదు. వర్షమొస్తే యిక చెప్పక్కర్లేదు డి.యమ్.కె.(D.M.K.) పార్టీవాళ్ళు అరవంలో ఉపన్యాసమిస్తున్నట్లు చెడామడా అరుస్తుండేవి.

మాకు విసుగుపుట్టి అప్పుచేసైనా ఆ ఖాళీస్థలం కొందామనుకున్నాం. కానీ మా దురదృష్టం! తీరా విచారిస్తే ఆ స్థలంకలవాళ్ళు ముస్లీములనీ, వాళ్ళు దరిదాపుల్లోకూడ లేకుండా పాకిస్థాన్‌లో వున్నారని తెలిసింది. వాళ్ళ బాపతు వాళ్ళు ఎవరూ యిక్కడ లేరనీ, దాని వివరాలు కావాలంటే పార్లమెంటుకు వెళ్ళాల్సిందే నన్నారు. చివరికి ఎవరో చెప్పారు. అందాకా అక్కర్లేదు, ఆస్థలం గలవాళ్ళ సొంతవాళ్ళు మద్రాసుకు దగ్గర్లోనే వున్నారని- మేము చాలా సంతోష పడిపోతూ, వాళ్ళ అడ్రసు, ఎవరో వాస్తుశాస్త్రజ్ఞుడికి తెలుసంటే అతన్ని పిలిపించాము, వివరాలు కనుక్కోడానికి.

ఆయన మా యింట్లో అడుగు పెడ్తూనే చాలా సీరియస్‌గా, సి.ఐ.డి.గా యిల్లంతా కలయజూస్తూ మధ్య మధ్య కనుబొమ్మలు చిట్లిస్తూ మేము కూర్చొమన్నా వినిపించుకోకుండా యిల్లంతా నాలుపక్కలా కలయచూట్టం మొదలెట్టాడు.

మా అత్తగారు అతడు వాస్తుశాస్త్రజ్ఞుడని తెలియగానే అతని కెక్కడలేని మర్యాదలూ చెయ్యడం మొదలెట్టారు. అతను కళ్ళుమూసుకుని ఒక్క క్షణం ఆలోచించి, "ఎవడండీ సన్యాసి?!... యీ యిల్లుకట్టిందీ?" అన్నాడు. "మా అబ్బాయ్!" అన్నారు మా అత్తగారు వెలవెలబోతూ. వాస్తుశాస్త్రజ్ఞుడు గతుక్కుమన్నాడు.

మా అత్తగారే మొదలెట్టారు. "యీ యింటికి ఇంజనీర్ ఎవరూ లేరండీ — మా అబ్బాయే దగ్గరుండి కట్టించారు. చాలామంది యీ యిల్లుచూసి దీని మాదిరే కట్టుకున్నారు, చాలా బాగుందని...అంటూ ఆమె కొడుకు ఇంజనీరింగ్ బుర్రని మెచ్చుకోవడం మొద

లెట్టింది. వాస్తుశాస్త్రజ్ఞునికి ఒక్కసారిగా చిరాకెత్తుకొచ్చింది. ''ఉహు'' — అన్నాడు తలవంచుకుని వేళ్ళమీద ఏదో లెక్క వెడుతూ... మా అత్తగారు బిత్తరపోయి కళ్ళు మూసుకుని, తల వంచుకుని ఆలోచిస్తున్న అతన్ని ఒక్క క్షణం అలాగే చూస్తూండిపోయారు. "చూడండి! యీ ప్రక్కస్థలం గలాయన అడ్రస్ ఎక్కడండీ! మేం కొనాలను కుంటున్నాం" — అన్నాం. ఆ మాట విన్న వాస్తుశాస్త్రజ్ఞుడు ఉలిక్కిపడి కళ్ళుతెరిచాడు. "అయ్యో తల్లీ! అసలు యీ యింటి వాస్తే సరిగ్గా లేకపోతే దక్షిణంవైపున్న ఆ స్థలం కొంటా నంటారేమిటి?"

మా అత్తగారి గుండె గతుక్కు మంది ... "యీ యింటి వాస్తు సరీగా లేకపోవడమేమిటయ్యా? మా అబ్బాయి దగ్గిరుండి కట్టిస్తేనూ! ... ఏది సరిగ్గా లేదంటావ్?"...

"ఏదీ సరిగ్గా లేదు...యీ యింట్లో- యిలా రండి!" అంటూ మా అత్తగార్ని యింటి సింహద్వారం దగ్గరకు తీసు కెళ్ళి "యీ వాకిలి వుండకూడదు" అన్నాడు.

''మరి మేమంతా లోపలి కెట్లా వచ్చేది?" అన్నారు మా అత్తగారు గుడ్లు తేలేసి...


"రావచ్చండి! అదుగో ఆ పక్క గది పడమటివేపు కిటికీ వుందే ... అది సింహద్వారం చెయ్యాలి" అన్నాడు. మా అత్తగారికి మతిపోయింది... "వీధి యిటుండే పక్క యింటి ప్రహారీగోడ ముందు సింహద్వారమేంటి?"

"అదేనండీ వాస్తు!" అన్నాడు.

"అయితే ఆ గదేంచేయడం?"

"గదంతా పగులగొట్టి చదును చెయ్యాలి."

"ఆఁ!" అంటూ మా అత్తగారు నోరు తెరిచారు.



"ఆ! అలా చేస్తేనే యీ యింట్లో మహాలక్ష్మి తాండవం చేస్తుంది. అష్ట ఐశ్వర్యాలూ కుప్పలు కుప్పలుగా వస్తయ్!

మా అత్తగారి ముఖంలో ఆశారేఖ తళుక్కున మెరిసి మరుక్షణం మాయ మైంది - "అది సరే! యీ గది పగల గొట్టించేస్తే పైన గట్టిన మేడమీది గది ఏమయ్యేట్టు?"

యీ ప్రశ్నతో వాస్తుశాస్త్రజ్ఞుడు ఒక్క క్షణం చిక్కులో పడ్డాడు.

''దీనిపైన గది వుందా?" అన్నాడు.

భానుమతీ రామకృష్ణ

"అవునూ ! మా అబ్బాయీ, కోడలూ వుండే గది..."

"అయితే ఆ పైగదికూడ విరగ్గొట్టిం చండి—. అసలావైపు గది వుండ కూడదు—ఆరోగ్యానికి మంచిదిగాదు... ఆ గదిలో ఎవరున్నా...పడుకున్నా... కూర్చున్నా ...నుంచొన్నా...ఎప్పుడూ ఏదో ఒక రోగం. ఏదో ఒక రుగ్మత వుంటూనే వుంటుంది." అన్నాడు.

అప్పటికి 15 రోజులుగా దగ్గూ, పడిశం పట్టి అవస్థపడుతున్న నావైపు అను మానంగా చూశారు, మా అత్తగారు. ఆ పైగదిలో నేనే వుండేది — నాకు నవ్వొచ్చింది..."అవునే :...నీకు యీ జలుబు యింకా తగ్గలేదుగదూ! అన్నట్లు జలుబు, దగ్గుకు ముందు జ్వరమొచ్చింది కదూ ! దానికి ముందు ఏదో తలపో టంటూ చాలారోజులు బాధపడ్డావ్ ! అంతకుముందు పంటినొప్పితో బాధ పడ్డావ్ !"

అవునని తలూపాను.

"అంతేనండీ! నే చెప్పలా...ఆ వైపు గదివుంటే యింకా పెద్దజబ్బులే చెప్పాలి."

నా గుండె ఒక్కక్షణం పీచు పీచు మంది. మా అత్తగారి ముఖం భయంతో బిగుసుకుపోయింది ... "అయితే ఆ గదులు రెండూ తీసేయమన్నారా" అన్నారు మా అత్తగారు.

"తక్షణం! ... అంతేగాదు! సింహ ద్వారం వెంటనే మూసెయ్యాలి" అన్నాడు వాస్తుశాస్త్రజ్ఞుడు ... ఒక్క చిటికె పొడుం ముక్కులో వేసుకుని—

మా అత్తగారు దిగులుగా నావైపు చూశారు ... నాకంతా అయోమయంగా కనిపించింది.

"అయితే యిల్లంతా ఒక్కసారి చూసి చెప్పండి, యింకా ఏమేం సర్దుబాట్లు చెయ్యాలో" అన్నారు మా అత్తగారు.

వాస్తుశాస్త్రజ్ఞుడు యిల్లంతా చూసి కిటికీలుండేచోట, వాకిళ్ళు పెట్టమన్నాడు. వాకిళ్ళని కిటికీలు చెయ్యమన్నాడు. వంటింటి పొయ్యి తీసి ముందువైపు హాల్లో పెట్టమన్నాడు. వాస్తుశాస్త్రప్రకారం ఆ మూలల్లోనే వంటిల్లు వుండాలన్నాడు. చివర్లో పెరటివైపుకెళ్ళి చూశాడు. "అయ్యయ్యో" అని ఒక్కగావుకేక వేశాడు ఏమిటేమిటని మా అత్తగారు అదిరిపడ్డారు. పెరట్లో యీ మూల బావి వుండకూడదన్నాడు. యీ బావి మేం స్థలంకొనేప్పుడే వుందన్నారు మా అత్త గారు ఖంగారుపడిపోతూ...

"అదే తప్పు జరిగింది. యీ బావి యిక్కడుంటే యింటికి చెడుపు. ముఖ్యంగా మీబోటి పెద్దవారికి చాలా ప్రమాదం—"

ఆ మాట విన్న మా అత్తగారికి గుండె గతుక్కుమని "అయితే ఏం చెయ్యమంటారు?" అన్నారు నీరసంగా.

"తక్షణం బావి మూయించాలి" అన్నాడు.

అది చాలా పెద్దబావి — యింటి చుట్టూవున్న తోటకు ఆ నీళ్లే సప్లయి అవుతయ్-పైగా యింత బావి మూయిం చేయడమంటే మాటలా! ఎంత మన్ను వెయ్యాలి, ఎంత డబ్బు ఖర్చు?

మా అత్తగారు దిగాలుపడిపోయ్యారు.

యింటికి ఆనుకొని పక్కనున్న ప్రహరీగోడచూసి, "యిదొక పెద్ద తప్పండీ! ... యీ యిల్లు యీ గోడ కింత దగ్గరగా వుండకూడదు. అసలు ఉత్తరంవైపు చోటెక్కువ వుండాలి. యిల్లు దక్షిణానికి జరపాలి!" అన్నాడు.

యిదేం బొమ్మరిల్లా జరపడానికి. ఎలా జరపడం? అయోమయంగా చూస్తున్న మాకు మరో 'సజషన్' యిచ్చాడు. "పోనీ! గోడపడగొట్టి బాగా అవతలికి జరిపి కట్టించండి."

"ఎలా?..." అవతలికి జరిపితే పక్కింటివాళ్ళ స్థళంలోకి పోతుంది గోడ...వాళ్ళూరుకుంటారా!... ప్చ్!" మా అత్తగారు అతను చెప్పిన మంచినీ చెడునూ వూహించుకొంటూ ఆలోచనలో పడ్డారు—వాస్తుశాస్త్రజ్ఞుడు కళ్ళు మూసు కుని నుదురుమీద వేళ్ళతోరాస్తూ "యీ యింటికిరాగానే మీరు బాత్‌రూములోనో లేక పెరట్లోనో జారిపడ్డారా?" అన్నాడు.

"పడ్డాను! ... వచ్చిన మర్నాడే వంటింట్లో మంచినీళ్ళ బిందెతోసహా పెద్ద పాటే పడ్డాను. నెలా రెండునెల్లు మంచం లోంచి లేవలేదు. అయినా మీరెట్టా కనిపెట్టారు?" అన్నారు మా అత్తగారు ఆశ్చర్యపడిపోతూ...

వాస్తుశాస్త్రజ్ఞుడు అలాగే కళ్ళుమూసు కుని త్రికాలజ్ఞానిలా గర్వంగా నవ్వుతూ ..."నాకు తెలుసండీ! నే చదివినశాస్త్రం అలాంటిది. మీరింకా యిక్కడే వుంటే మరో వారంరోజుల్లో మీకు మరొక పెద్ద గండం వుంది" అన్నాడు.

మా అత్తగారి ముఖం భయంతో పాలి పోయింది. ఆమెకు ముచ్చెమటలు పట్టాయ్.

"అయితే యిప్పుడేం చేయమం టారు?" అన్నారు.

"ఒకపని చేయండి. మీ రేమనుకోక పోతే యీ యిల్లు మాట్లాడకుండా ఎవరి కైనా అద్దెకిచ్చి, మీకు మంచియిల్లు అద్దె కిప్పిస్తా. వెంటనే వెళ్ళండి అక్కడికి" అన్నాడు. మా అత్తగారి ప్రాణం లేచొచ్చింది. ''అలాగే" అన్నారు మా అత్తగారు. "కానీ యీ యింటి వాస్తు బాగాలేదని తెలిసినవాళ్ళు, మా యిల్లు అద్దెకు తీసుకుంటారా?" అని సందేహం వెలిబుచ్చారు మాఅత్తగారు. "ఆ సంగతి నే చూసుకొంటాను. ఎలాగో తంటాలు పడి ఏదో ఒక పార్టీని తెస్తానుగా." అన్నాడు వాస్తు మరొక చిటికెపొడుం ముక్కులో వేసుకుని తృప్తిగా పీలుస్తూ.

...యీ సంగతి విన్న మావారు మా అత్తగార్ని కేకలేశారు. "ఏమిటీ చాదస్తం. వున్నయిల్లువదలి అద్దెయింటికి పోవడం."

మా అత్తగారు కాదుగూడదని మొండి పట్టు పట్టారు. ఆ యింట్లో వుంటే చాలా అనర్థాలున్నాయన్నారు. అంతేగాదు. యింకా అక్కడేవుంటే తను చచ్చి పోతానని మంకుపట్టుపట్టారు.

ఆమెకోసం మావారు ఒప్పుకోక తప్పలేదు.

ఒక శుభముహూర్తాన పాండవుల్ని అరణ్యవాసానికి పంపినట్లు మమ్మల్ని ఒక అద్దెయింటికి తీసుకెళ్ళి జేర్చాడు — వాస్తుశాస్త్రజ్ఞుడు.

చేరేముందు అద్దెయిల్లు చూస్తా మన్నారు, మా అత్తగారు.

"అహఁ! ఒద్దండీ! చూడక్కర్లేదు, కొత్తయిల్లు—మీ యింటికంటె బాగుం టుంది. వాస్తు బ్రహ్మాండంగా సరి పోయింది. ఆ యింటికెళ్తే మీ కెంత కలి సొస్తుందో చూడండి! అంటూ మా అత్త




గారి నోరుమూశాడు. తీరా ఆ యింట్లోకి వెళ్ళిచూస్తే, ఆ యిల్లంతా అధ్వాన్నంగా వుంది. బాడుగమాత్రం మేము నెలకి అయిదువందల రూపాయలు యిచ్చే యేర్పాటుచేశాడు.

యే సౌకర్యాలూ లేవు ఆ యింట్లో. మా సొంతయింటిని మటుకు నెలకి రెండువందలకే బాడుగ కిప్పించాడు వాస్తు...అంతేగాదు, మేము ఖాళీచేయకుండానే, వాస్తు తనకు తెలిసినవాళ్ళని తీసుకొచ్చి మాతో రహస్యంగా వాళ్ళది మంచి కుటుంబమనీ, దోషాలున్నాయ్ కనుక, తను వాళ్ళకావిషయం చెప్తే, వద్దంటారు గనుక, తక్కువ బాడుగకు యిమ్మనీ, మా అత్తగారితో మాట్లాడి ఒప్పించి యిప్పించాడు. మరీ అంత తక్కువ బాడుగయితే ఎలా యివ్వడం!...అంత పెద్ద యిల్లు, అన్ని సౌకర్యాలూ వున్నాయ్!...పోనీ మంచి బాడుగ వచ్చేదాకా ఖాళీగా వుంచుదామన్నారు మావారు.

"ఆ! నీకు తెలీదులేరా! యిల్లు ఖాళీగా వుంచితే, యింట్లో ఏదో దోషం వుందీ, అందుకే సొంతవాళ్ళే వెళ్ళిపోయారు ! ... అద్దింటికి, అని వాస్తు విషయం ఆ నోటా ... ఆ నోటా పడి, అసలు యిల్లు పాడు పెట్టాల్సొస్తుంది! యింకా నయం, వాస్తుశాస్త్రజ్ఞుడు... దేముడిలా వచ్చి మనల్ని సమయానికి కాపాడాడు. సంతోషించు" అంటూ మావారి నోరుమూశారు మా అత్తగారు.

ఎంత సరిపెట్టుకొందామన్నా ఆ యింట్లో వారంరోజులు వుండలేక పొయ్యాము. యిరుగు పొరుగు కూడా మహా అసహ్యమైన వాతావరణమని వెళ్ళిన నాలుగు రోజుల్లోనే గుర్తించాము. ఏమైనా యింకో యింటికి వెళ్ళాలి. అడ్వాన్సు రెండు నెల్లదిపోతే పోయిందనుకున్నాం. ఖాళీచేస్తామని వినగానే ఆ యింటియజమాని ఎవరో రౌడీలా వున్నాడు, వచ్చి, "ఎలా వెళ్తారూ? మాకు ఒకసంవత్సరం వుంటామని అగ్రిమెంట్ వ్రాశారు. మధ్యలో వెళ్తే మాకు నష్టం – వెళ్ళదల్చుకుంటే సంవత్సరం బాడుగ కట్టివెళ్ళండి–''... అన్నాడు.

అది విని మేము నిర్ఘాంతపోయాము. మావారికి ఒళ్ళుమండి, ''అలా ఎందుకిస్తాము, యివ్వడానికి వీల్లేదు – మాకు చెప్పింది ఆ వాస్తుగాడు రెండునెల్ల అడ్వాన్సు, అగ్రిమెంటే" అన్నారు.

"వాడలాగే చెప్తాడు. వాడికిది అలవాటే, వాడి కమీషన్‌డబ్బు వాడు తీసుకుని పోతాడు. వాడికేం ! ... బ్రోకర్ గాడు!..."

ఆ మాటతో మా అందరికళ్ళు తెరుచుకున్నాయ్ ... మా అత్తగారికి ఒక్కసారి జ్ఞానోదయం కలిగింది. "ఎంత మోసం ? వాడు కమీషన్ బ్రోకరన్నమాట ... వాస్తు బాగోలేదని నాటకమాడి, మా యిల్లు తక్కువ బాడుగకి బాడుక్కివ్పించి, అక్కడా యిలాగే కమీషన్ కాజేసి యిక్కడ మమ్మల్ని నరకంలాటి యింట్లోపడేసి, యీ యింటిమీదా కమీషన్ తీసుకుని ఉడాయించాడు.

"ఆ దిక్కుమాలిన వెధవ, వాస్తు శాస్త్రం బురఖావేసుకుని యింత మోసం చేస్తాడనుకోలేదు.

"పాండవులు అజ్ఞాతవాసం చేసినట్లు వున్న సొంతయిల్లు వదిలేసి..."అంటూ కళ్ళుతుడుచుకున్నారు మా అత్తగారు.

"పోన్లేమ్మా! ఎలాగో వాళ్ళకు నచ్చజెప్పి వాళ్ళని ఖాళీచేయమని మనింటికి మనం పోదాం. నువ్వేం బాధపడకు'' అంటూ మావారు వోదార్చారు మా అత్తగార్ని.

ఆ యింటినుంచి తిరిగి మాయింట్లో వచ్చిపడ్డానికి తలప్రాణం తోక్కొచ్చింది. ఆ తర్వాత ఎవరైనా వాస్తు శాస్త్రంగురించి మాట్లాడితే ఆవిడకి చిర్రెత్తుకొచ్చేది.

"ఆ దిక్కుమాలిన వాస్తుమాట నా దగ్గరెత్తొద్దు – మమ్మల్ని అష్టకష్టాలూ పెట్టింది ... అసలు వాస్తు–శాస్త్రమనేదే లేదు పొమ్మన్నారు" మా అత్తగారు.